అలా ఏ సందర్భంలోనైనా, ఏ కొంచెం అవకాశం వచ్చినా... ఎన్నెన్నో విషయాలు చెబుతూండేది! రాత్రిపూట పడుకునేటప్పుడయితే కథలు చెప్పటం తప్పనిసరి...! ఆ సమయానికి నాన్నమ్మకి కొత్తకథ ఏదీ గుర్తుకురాకపోతే, చెప్పిందే అయినా మళ్ళీ చెప్పమని, వింటూ నిద్రపోవటం అలవాటుగా ఉండేది! నాన్నమ్మ చెప్పే ఏ కథలో అయినా నీతి నిజాయితీల ప్రస్తావన తప్పకుండా ఉండేది! కబుర్లు చెప్పినా కూడా అంతే... నలుగురితో కలిసి మెలిసి ఉండటం... సాయం చేస్తే కలిగే సంతృప్తి, ఆనందం ఎంత విలువైనవో... లాంటి విషయాలే ఎక్కువగా చోటు చేసుకునేవి.

నా ఉద్దేశ్యంలో... బాల్యంలో తల్లిదండ్రులు, పెద్దవాళ్ళు చెప్పే కథల ప్రభావం పిల్లలపై చాలా ఉంటుందని! పెద్దయ్యాక... వాళ్ళ ఆలోచనల్లో... పెద్దవాళ్ళద్వారా విన్న నీతి కథల ప్రభావం తప్పకుండా ఉంటుంది. కాబట్టి వాళ్ళవలన సమాజానికి మంచి జరుగుతుందో లేదో ఖచ్చితంగా చెప్పలేకపోయినా చెడు మాత్రం జరగదని అనుకుంటాను! వాళ్ళ ప్రవర్తనవల్ల ఎవరికైనా హాని జరుగుతుందేమోననే వెరపు ఉంటుంది! అది కూడా పరోక్షంగా సమాజానికి జరిగే మేలే కదా...!”

ఏమిటన్నట్లుగా చూస్తుంటే... "మీరు... పెద్దగా చదువుకోలేదని చెప్పినట్లు గుర్తు. నిజమేనంటారా... నాకలా అనిపించటం లేదు మరి...!" అన్నాను. ఆయన 'ఎందుకనీ' అని ప్రశ్నించకముందే నేనే మళ్ళీ అన్నాను... "మీ భాష వింటుంటే నాకా అనుమానం వచ్చిందండీ...!"

చిరునవ్వుతో చెప్పారు. "నేను చదువుకోలేదంటే... డిగ్రీలు లేవని అర్థంగానీ పుస్తకాలు మాత్రం చాలానే చదివాను. మా ఊళ్ళోనే నరసింహమూర్తిగారనే ఓ గొప్పాయన ఉండేవారు. వారింట్లో బీరువాల నిండా ఎన్నెన్నో పుస్తకాలు ఉండేవి. అవి మాత్రమే కాదు, నా దృష్టికి ఏ పుస్తకం వచ్చినా చదవాలనే తహతహ ఉండేది! కేవలం నా మాటల్ని బట్టే అటువంటి అభిప్రాయానికి వచ్చావంటే... ఇక్కడ నాకో విషయం గుర్తుకువచ్చి సరదాగా చెప్పాలని పిస్తోంది.

ఒకరోజు... మా నాన్నమ్మని చూసిపోవటానికని నలుగురైదుగురు పల్లె నుండి వచ్చారు. ఉదయం తొమ్మిది గంటలకు వచ్చినవాళ్ళు సాయంకాలం వరకూ నాన్నమ్మతో కాలక్షేపం చేసి తిరిగి నాలుగ్గంటల బస్సులో వెళ్ళిపోయారు.

వాళ్ళున్నంతవరకూ అందరూ గలగలా కబుర్లు చెప్పుకోవటమే. నాన్నమ్మ ఎవరెవరివో పేర్లు చెప్పి వాళ్ళ సంగతులు అడగటం... వాళ్ళేమో అడగని వాళ్ళ కబుర్లూ, విశేషాలూ కూడా ఏకరవు పెట్టటం...!

వచ్చింది నలుగురైదుగురే అయినా ఓ నలభైమంది చేరినట్లుగా మా ఇంట్లో ఒకటే సందడి! వాళ్ళ యాసలో మాటలు చెప్పటం నాకు చాతకాదుగానీ, ఓ రెండు మూడు మాటలు చెప్పే ప్రయత్నం చేస్తాను.

'ఏటే అప్పా... ఈడకొచ్చాక మా ఊసే లేదు నీకు. ఓ పాలి అయినా సూడ్దానికి ఊరుకి రాలేదుగందా...' అంటే ఇంకొకామే 'ఏం వస్తది... మనవడి మురిపెంలో పడి మర్సిపోనాదిలే...' అంటూ 'రా...రా.. అబ్బిగా...' అని పిలిచి నన్ను ఒళ్ళో కూర్చోబెట్టుకుని ముద్దుపెట్టుకుంది.

'స్వంత ఊరుని మర్చిపోటమంటే... కన్నతల్లిని కాదనుకోటమే కదూ... పనిలోబడి, వీలుకాక... అంతే మావోడు అక్కడికి వచ్చినపుడల్లా ఇదే మాటనీవోడు. కన్న పిల్లల్ని మర్చిపోతారేటిరా ఎదవా అనేదాన్ని. పనులతో తీరుబడి దొరక్క అంతేగానీ...!' అంది నాన్నమ్మ.

'ఈ సారి నేనే నాన్నమ్మను ఊరుకు తీసుకొస్తానండీ...!' అనగానే అందరూ పెద్దగా నవ్వుతూ 'అమ్మో... బుడ్డోడికి ఎంత అభిమానమో...!' అంటూ మురిసిపోయారు.

నాక్కొంచెం సిగ్గనిపించింది కూడా.

వాళ్ళంతా వెళ్ళిపోయాక నాన్నమ్మతో అన్నాను "నువ్వింత ఆనందంగా నవ్వుతూ కబుర్లు చెప్పడం ఎప్పుడూ చూడలేదు. ఈ రోజే చూశాను. ఇక్కడికొచ్చాక నీకు ఈ ఆవులు,

గేదెల పనితో తీరుబడి దొరకటం లేదుకదా... నిన్ను పంపించమని నాన్నకు చెబుతానుండు...!"

'భలేవాడివిరా... మీ నాన్న ఈ మాట ఎన్నిసార్లన్నాడో నీకేం తెలుసురా...! ఈ మధ్యనేగా అక్కడికి వెళ్ళివచ్చాను... ఎపుడో మళ్ళీ వెళ్ళొచ్చులే అని అశ్రద్ధ చేశానంతే...! ఇపుడు నువ్వే వాళ్ళకి చెప్పావుగా, అలాగే ఎప్పుడో ఓ సారి నీకు బడి లేనపుడు వెళ్ళొద్దాంలే..' అంది.

వాళ్ళని చూసినప్పుడూ,కబుర్లు చెబుతున్నప్పుడూ నాన్నమ్మ మొహంలో ఎంత వెలుగో.. ఎంత ఆనందమో...!

'నాన్నమ్మా... నిజం చెప్పు... నీకీ వూళ్ళో అంత బావుండలేదుగదూ.. ఈ రోజు ఉన్నంత ఆనందంగా ఇంతకు మునుపెప్పుడూ నాకలా కనిపించలేదూ...?' అనడిగాను.

నాన్నమ్మ చిన్నగా నవ్వి నా తలమీద సుతారంగా మొట్టింది. 'నీకలా అనిపించిందా?' అంది కొంచెం ఆశ్చర్యంగా చూస్తూ.

'అవును... నీ భాష కూడా వాళ్ళతో మాట్లాడేటప్పుడు మారిపోయింది. అబ్బో... వాళ్ళ మాటలకు ఆ యాసకి నాకు భలే నవ్వొచ్చింది కూడా...!' అన్నాను.

"ఆ వూళ్ళో ఉన్నప్పుడూ ఆనందంగానే ఉన్నాను... ఇపుడూ అలాగే ఉన్నాను. అప్పుడు మీతాతతో కలిసి ఉండటం... అలవాటైన ఊరులో... బంధు బలగం మధ్య ఆనందంగా రోజులు గడిచిపోయాయి. ఇప్పుడూ అంతే... కొడుకుతో.. ఎటువంటి పొరపొచ్చాలూ లేకుండా నెమ్మదైన కోడలుతో కలిసి ఉండటం... నా కిష్టమైన పశుపోషణతో కాలక్షేపం చేయగలగటం... ఆ పైన అన్నిటినీ మించి ముత్యం వంటి మనవడి ముచ్చట్లతో రోజులు పరుగులు పెడుతున్నట్లుగా గడిచిపోవటం... ఇంతకంటే నాకు ఇంకేం కావాలిరా...?

ఏ పరిస్థితులనైనా మనకు అనుకూలంగా మార్చుకుంటూ బ్రతకటం తెలుసుకోగలిగితే... ఎక్కడైనా సరే ఆనందంగా ఉండగలం...! తెలిసిందా...?

ఇంకోటి. ఏ యాస అయినా భాష ఒకటే గదా... భావం తెలియజేయటమే కదా... అవునా...? అందుకే... వాళ్ళను చూసినప్పుడు, మాట్లాడుతున్నప్పుడు... అమ్మ ఒడిలో చేరినంత సంబరమన్నమాట...! ఇప్పుడు మనసు మాటిమాటికీ ఇటువైపు లాగుతుంది...! అప్పుడు అక్కడనుండి ఇక్కడకు వచ్చి, నాలుగు రోజులన్నప్పుడూ చాలా సంతోషంగా ఉండేది... అలాగని ఇద్దరం ఇక్కడే ఉండిపోతే...మామూలైపోయేది...! ఏంటో...నీకర్థం అయ్యేట్లు చెప్పగలుగుతున్నానో, లేదో...!' అంటూ నిట్టూర్చింది.

"మరి... ఇప్పుడు... ఇక్కడే వుంటున్నావుగా, మామూలుగా ఉండి, నీకంత బాగా లేదన్నమాటేగా...?" నా ఆలోచనకు వచ్చిన సందేహాన్ని బయటపెట్టాను.

'నా స్థానం ఇక్కడే అని నిర్ణయమైపోయాక, చెప్పానుగా, ఈ పరిస్థితులకు బాగా అలవాటుపడి ఆనందంగానే ఉన్నాను! పైగా మామూలుగా కాకుండా రోజూ కొత్తరకంగా

గడిచిపోవటానికి ముఖ్యకారణం ఉంది... అది నువ్వే..' అంటూ పకపక నవ్వింది.

ఆ మాట నాకు ఆనందం కలిగించినా, ఆశ్చర్యంగా చూస్తూ 'అదెలా...?' అనడిగాను.

'నీదేమో ఎదుగుతున్న వయసా... నీ ఎదుగుదలని గమనిస్తూ... నువ్వు బడినుంచి వచ్చాక నీ కబుర్లన్నీ వింటూ, చెబుతూ, కథలెన్నో కలబోసుకుంటూ ఇద్దరం మంచి నేస్తాల్లా కూడా ఉంటున్నామా, మరి... నామాట నిజమే కదా...?' అంది నవ్వు మొహంతో.

నాన్నమ్మ ఏ విషయమైనా ఎంత బాగా చెబుతుందీ అనుకుంటూ ఆశ్చర్యపోయాను.

నాన్నమ్మ మాటలు నిజంగా గొప్పగా ఉంటాయా లేక నాన్నమ్మంటే నాకున్న ఇష్టం వలన నాకలా అనిపిస్తుందా...? ఆ వయసులో నాకు కలిగిన సందేహమే అది!

***

నేను రోజూ అలవాటుగా పెందలాడే ఇంట్లోవాళ్ళతో పాటుగా లేచేవాడిని కదా, నా పనులన్నీ చకచకా పూర్తిచేసుకుని, ఆదరా బాదరా ఇంత చద్దన్నం కూడా తినేసి, పుస్తకాల సంచీ భుజానికి తగిలించుకుని పాలక్యాన్‌తో వెళ్తున్న నాన్న వెంట నరసింహమూర్తిగారింటికి వెళ్ళేవాడిని.

వాళ్ళింట్లో ఒక వైపున ఉండే వరండాలో రెండు స్తంభాలమధ్య ఉన్న గట్టు పైకెక్కి కూర్చుని సంచీలోని పుస్తకాలన్నీ పరుచుకుని చదువుకోవటమో, రాసుకోవటమో చేస్తూండే వాడిని. బడి టైము అవగానే అక్కడే వాలుకుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటుండే మూర్తిగారికి చెప్పి సంచీ తీసుకుని పరిగెత్తేవాడిని.

ఆయన మధ్య మధ్యలో లేచి అటూ ఇటూ తిరుగుతూండేవారు. ఆ ఇంటికి రెండు వైపులా రోడ్డు ఉండటంతో అటూ ఇటూ గేట్లు, వరండాలూ ఉండేవి. అటుపక్క వరండాలో మూర్తి గారి కోసం వచ్చేవాళ్ళు బెంచీలమీద కూర్చునుండేవాళ్ళు, వాళ్ళతో మాట్లాడి మళ్ళీ ఇటువైపు వచ్చి కూర్చుండేవారు. నేనేం చదువుతున్నానో, బడిలో ఏం చెబుతున్నారో, పరీక్షల సంగతీ... ఇలాంటివి వాకబు చేస్తూ, ఏవో సలహాలూ ఇస్తూండేవారు.

నరసింహమూర్తిగారి పర్యవేక్షణలో అని మాత్రమే కాకుండా అక్కడ కూర్చుని చదువుకుంటే, ఆ ఇల్లు, పరిసరాలు అన్నీ కూడా నాకు చదువుపట్ల ఆసక్తిని పెంచుతాయని నాన్నకో నమ్మకం ఉండేదని నాకనిపిస్తుంది.

నాన్నమ్మలాగే నాన్నకూడా పాలేర్లు పితికి తెచ్చిన పాలనుండి కొన్ని పాలు ఒక క్యాన్‌లోకి తీసుకుని వేరే పెట్టేవాడు. మిగతా పాలని పాలేర్లు వాడుకలవాళ్ళకి పోయటానికి తీసుకుని వెళ్ళే వాళ్ళు. ఆ క్యాన్‌ని కూడా నాన్నే శుభ్రంగా తోమటం నేను చూశాను.

అపుడే ఒకసారి నాన్నను అడిగాను "నాన్నమ్మంటే దేముడుపట్ల ఉన్న భక్తి కొద్దీ గుడికి పాలు అలా తీసుకుని వెళ్తుందిగానీ నువ్వు కూడా ఇదేంటి నాన్నా నరసింహ మూర్తిగారింటికి స్వయంగా తీసుకెళ్ళి ఇవ్వటం ఎందుకూ...?" అని.

నాన్న చిరునవ్వుతో చెప్పాడు 'మా అమ్మకి దేముడిపట్ల ఎంత భక్తి ఉందో, ఈ మూర్తి గారంటే... నాకంతకు మించిన గౌరవం, అభిమానం ఉన్నాయి...!'

'అంటే...?' అర్థంకాక అడిగాను.

'మనం ఈ రోజు ఇలాంటి స్థితిలో ఉన్నామంటే... దానికి కారణం నరసింహ మూర్తిగారే. ఆ కుటుంబం పట్ల భక్తి గౌరవాలకొద్దీ మా నాన్న వద్దంటున్నా వినకుండా పాలు స్వయంగా ఇచ్చి వచ్చేవాడు... ఆ తర్వాతవే అమ్మకాలన్నమాట! వారి చేతి చలువ వల్లే పాల వ్యాపారం ఇంతగా పెరిగిందని మా నాన్న గట్టిగా నమ్మాడు. ఏదో అంతంత మాత్రంగా ఉండే రాబడితో అప్పటి రోజులు ఇబ్బందిగా గడుస్తూండేవి. తర్వాత ఈ నరసింహమూర్తిగారి దయవలన ఆదాయం పెరిగి... పశువుల్ని కొనటమూ... పదిమందిని పోషించగల స్థాయికి చేరుకోవటం జరిగింది...!'

'అంటే... నరసింహమూర్తిగారు ఆవులు, గేదెలు కొనుక్కోవటానకి డబ్బు అప్పిచ్చారా నాన్నా...?'

'అప్పుఇస్తే... తీర్చేవాళ్ళం... వడ్డీతో సహా చెల్లించగలిగితే... ఇంకా బావుండేది...! అలా కాకుండా మూర్తిగారు మనకి చేసిన సాయం మామూలుదికాదు... గొప్ప మనసున్న వాళ్ళు మాత్రమే అలా చేయగలరు...!'

నరసింహంగారి తండ్రి బాగా పేరున్న రాజకీయ నాయకుడు. నాకు సరిగ్గా తెలవ దుగానీ ఆయనకు ఏవో పదవులుండేవనుకుంటా. వారి దగ్గరకు పెద్ద స్థాయి నాయకులు, ప్రభుత్వాధికారులూ ఏవో పనులమీద వచ్చి వెళ్తూండేవారు. వారి నుండి ఎన్నెన్నో సహాయాలు పొందిన ఊరి ప్రజలు ఆయన్నో దేముడిగా భావించి గౌరవించేవాళ్ళు. మన ఊళ్ళో ఆయన మాటకు తిరుగు ఉండేదికాదు.

ఒకరోజు ఆయన హఠాత్తుగా గుండెపోటుతో మరణిస్తే... దినం రోజు బ్రాహ్మణు లిద్దరికి దానం ఇవ్వటానికి గాను ఈ మూర్తిగారు తన చిన్నాన్నతో కలిసి సంతకు వచ్చారు. అంతకు రెండు రోజుల ముందే మాకున్న ఆవులు రెండూ ఏదో తెలియని జబ్బుతో చనిపోతే కనీసం పాలిచ్చే ఒకదానిని అయినా కొనాలని ఇంట్లోవున్న డబ్బుతో మేమూ ఆ సంతకే వచ్చాం.

ఆ రోజంతా ఎన్ని బేరాలు సాగించినా, మా దగ్గిరున్న డబ్బుకు సరిపడా ధరగలదేదీ దొరకలేదు. ఇక చేసేదేం లేక నాన్న, నేను ఇంటిమొహం పట్టాం.

నరసింహమూర్తిగారిదీ, నాదీ ఒకటే వయసు. ఇంచుమించుగా అనుకో. దేన్నీ కొనకుండా ఎందుకు తిరిగి వెళ్ళిపోతున్నారని ఆరాతీస్తే... మా నాన్న ఏదో చెప్పబోతోంటే... నేనే ముందుగా మా దగ్గిరున్న డబ్బుకు సరిపడా ఏదీ దొరకలేదనే నిజాన్ని చెప్పేసాను.

అప్పుడాయన ఒకే ఒక క్షణం ఆలోచించి 'అయితే ఈ ఆవుల్ని మీరు తీసుకెళ్ళండి...

మేం ఇంకో ఏర్పాటు చేసుకుంటాం...' అనే సరికి మా నాన్న చాలా కంగారు పడ్డాడు. ఆ మాటకి అంగీకరించలేదు.

ఇద్దరి మధ్యా వాదోపవాదాలు సాగాయి. మూర్తిగారి చిన్నాన్నకి ఏం చెప్పాలో తెలియనట్లుగా అయోమయంగా నిలబడిపోయారట! తీసుకోమని ఒకరు, వద్దని ఇంకొకరూ ఇలా ఎక్కడైనా జరుగుతుందా అనే ఆశ్చర్యం కూడా ఆయనలో స్పష్టంగా కనుపించింది!

'చిన్నపిల్లాడివి బాబూ... నా మాట విను. రేపు జరగాల్సిన కార్యక్రమం కంటే నా అవసరం పెద్దదేమీ కాదు. రేపు అన్నీ సక్రమంగా జరగకపోతే, పెద్దవాళ్ళు నొచ్చుకుంటారు. దానికి మేం కారణం కావటం నాకూ ఇష్టం లేదని నాన్న ఖండితంగా చెప్పేసరికి ఆవుల్ని తోలుకు వెళ్తున్న పాలేరు వెంట వాళ్ళిద్దరూ వెళ్ళిపోతే, మేం ఇంటికి వచ్చేశాం.

అయితే, కాసేపటికే అనుకోనివిధంగా ఆవుల్ని వెంటబెట్టుకుని పాలేరుతో సహా వాళ్ళిద్దరూ మా ఇంటికి వచ్చారు. మూర్తిగారి చిన్నాన్నే ఈసారి మా నాన్నకు నచ్చచెప్పారు.

'మా వదిన కూడా మావాడి మాటలను అంగీకరించింది. ఇంకోమాట కూడా చెప్పమంది. రేపటి రోజున దానంగా ఇవ్వాల్సిన ఆవుల్ని మీకు ఇస్తేనే ఎక్కువ ప్రయోజనం ఉంటుందనీ, వాటికి పోషణా బాగా ఉంటుందనీ అంది. రేపటి కార్యక్రమంలో దానం ఇవ్వటానికిగానూ ఆవుల వెండి ప్రతిమల్ని కొనుగోలు చేయటానికి పట్నానికి మనిషినీ వదిన పంపించింది.' ఆ మాటలకు మా నాన్న కళ్ళవెంట ధారాపాతంగా నీళ్ళు కారిపోయాయి.

అంత గొప్పాయన పేరు మీద ఆ ఆవుల్ని స్వీకరించగలగటం... ఎంతటి పుణ్యమో అని నాన్న చాలా మరిసిపోయాడు. తండ్రి గుణగణాల్ని అంత చిన్న వయసులోనే పుణికి పుచ్చుకున్న మూర్తిగారని పదే పదే దీవించాడు కూడా!

ఆ కృతజ్ఞతను వెల్లడి చేయటానికన్నట్లు ముందుగా వాళ్ళింటికి పాలు తీసుకువెళ్ళే పద్ధతిని మా నాన్న పాటిస్తే... నేను ఇప్పటికీ కొనసాగిస్తున్నానన్న మాట...!

అంత చిన్న వయసులోనే నరసింహమూర్తిగారు అలా చేయటం నాకు విభ్రాంతి కలిగించింది.. ఒక క్షణం తర్వాత మళ్ళీ మా నాన్నే చెప్పాడు.

'మూర్తిగారి తండ్రి కూడా ఒక సందర్భంలో ఎవరితోనో చెప్పిన మాటలు నాకు గుర్తున్నాయి. 'పుణ్యం వస్తుందని దానాలు చేయటం కంటే... మనకు తెలిసిన మన చుట్టుపక్కల వాళ్ళ అవసరాలను గమనించి సాయం చేయటమే మంచి పని అనిపిస్తుంది నాకు...' అన్నారు.

అప్పుడు నాకంతగా అర్థం కాలేదు గానీ తర్వాత కొంచెం పెద్దయ్యాక ఆ మాటలకర్థం అవగతం అయింది...! తల్లిదండ్రుల భావాలు, ఆలోచనాధోరణి చాలావరకూ పిల్లలపై ప్రభావం చూపిస్తాయనేది. అందుకేనేమో... నరసింహమూర్తిగారి తండ్రి ఆలోచనా విధానాన్ని బట్టి... ఎవరికో దానం ఇచ్చే బదులు... మా అవసరానికి ఆవుల్ని సాయంగా అందిస్తే సరిపోతుందని అనుకున్నారన్నమాట...!

చిన్నతనంలో పసి మనసుల్లో పెద్దల మాటలు, చేతలతో నాటబడిన బీజాలు పెద్దయ్యాకయినా మొలకెత్తుతాయి! అందుకే... పిల్లలకు మంచి నీతికథలు, మహానుభావుల సూక్తులు చెబుతూండాలని అంటారు...!

'అంటే... నీలా... అన్నమాట...! అవునా...?' అన్నాను.

మా నాన్న పెద్దగా నవ్వాడు. 'నువ్వడిగిన సందేహానికి చెప్పానంతేగానీ, నాకేమీ సూక్తులు, నీతికథలూ తెలియనే తెలియవురా...!' అన్నాడు.

ఒక క్షణం తర్వాత... నేను చేయలేకపోయినా ఆ పని మీ నాన్నమ్మ, అమ్మా చేస్తుంటారుగా...!' అన్నాడు చిరునవ్వుతో.

మా నాన్న తనలో ఏ గొప్ప సంగతీ లేదన్నట్లు వినయంగా ఉంటాడు. పెద్దయ్యాక తన సమవయస్కుడైన నరసింహమూర్తిగారిని 'మీరు' అంటూ మాట్లాడేవాడే తప్ప ఏనాడూ 'నువ్వు' అంటూ ఏకవచన ప్రయోగం చేయలేదు.

ఒకసారి మూర్తిగారే 'నేను నిన్నేమో రాఘవా అంటూ చనువుగా, స్నేహంగా మాట్లాడుతూంటే, నువ్వు మాత్రం... మీరు, గారు అంటూ నన్ను దూరం పెడుతున్నావ్‌గా...' అన్నారు కొంచెం నిష్ఠూరంగానే!

'పిలుపు ఎలా ఉంటేనేం... అభిమానం ఉన్నప్పుడు ఇలాంటివి పట్టించుకోనవసరం లేదు...!' అంటూ నాన్న తేల్చేశాడు తప్ప తన తీరు మార్చుకోలేదు.

మా నాన్నని ఊళ్ళో అందరూ రాఘవయ్యగారూ అని గౌరవంగా పిలుస్తారు. అందుకే నేను నాన్నని నిలదీశాను.'మీరిద్దరూ ఒకే స్కూల్లో చదువుకున్నారు ఒకే వయసువాళ్ళు కూడాను. ఆపైన ఆయనే 'గారు' అంటూ మన్నించి పిలవొద్దని చెబుతున్నారు. అయినా నువ్వెందుకు వినిపించుకోవు...? వాళ్ళు మనకి సాయం చేశారు... నిజమే...! ప్రతిగా మనమూ ఉచితంగా పాలు పోస్తున్నామా... మనమూ ఇప్పుడీ ఊళ్ళో కాస్త కలిగిన కుటుంబం క్రిందే లెక్క కదా... నువ్వు అందరికీ అంతో ఇంతో సాయం చేస్తూనే ఉంటావ్‌గా...!' అన్నాను.

'ఉచితంగా... అనే మాట వాడటం సరికాదు. ఆ అవసరం వాళ్ళకి లేదు. స్థాయి, సంపదల గురించి కాదు... నా ఉద్దేశ్యంలో... ఆ కుటుంబానికి ఉన్న విలువ చాలా ప్రత్యేకం...! మొదటినుండీ శ్రీమంతులయినా... కొంచెం అయినా దర్పం, అహంకారం ఉండవు! నేను గౌరవం ఇచ్చేది ఆ కుటుంబం సంస్కారానికే...! ఇంటికి వచ్చిన బంధువులని ఎంత ఆదరంగా పలకరిస్తారో.... పనివాళ్ళను కూడా అంతే అభిమానంగా చూస్తారు..! చాలా తక్కువమంది సంపన్నులలో మాత్రమే అటువంటి సంస్కారం చూస్తాం...!

నేను నవ్వుతూ 'నీకేం తెలియదంటూనే చాలా విషయాలు చెబుతూంటావ్...' అంటూ నవ్వాను.

నాన్న కూడా నవ్వుతూ 'నేను నిజమే చెప్పానురా! మన ఇంట్లోనే లెక్కిస్తే... నాన్నమ్మ,

మీ అమ్మ తెలివైనవాళ్ళు... తెలుసా...? అందుకే ఏ విషయం అయినా అమ్మకు చెప్పకుండా, మీ అమ్మ సలహా తీసుకోకుండా చేయను! మీ అమ్మ చదువుకున్నదే కాదు, తెలివైనదికూడా! నువ్వు మాత్రం నాలా కాకుండా బాగా చదువుకోవాలి... మీ అమ్మ కంటే కూడా ఎక్కువగా... సరేనా...?' అనేసరికి నేను కూడా నవ్వుతూ 'అలాగే నాన్నా...' అంటూనే 'నీకేం తెలియదని ఒప్పుకోవటంలోనే నీ గొప్పతనం ఉంది...!' అన్నాను.

'మరి... మీరు.. ఎందుకు పెద్ద చదువులు చదవలేకపోయారు... మీ నాన్నగారికి మాట ఇచ్చారుగా...' మధ్యలో కల్పించుకుంటూ అడిగాను.

దానికాయన "ఏది గుర్తొస్తే... అది చెప్పకుపోతున్నానమ్మా... ఆ కారణమూ చెబుతాను..." అనగానే నేనూ చిరునవ్వుతో

"సరే..సరే... అలాగే కానివ్వండి. నేను ప్రశ్నలతో అడ్డురాను లెండి...!" అన్నాను.

***